క్లుప్తంగా

మాజీ ఎంపీ సురేష్‌ను కలిసిన నాయకులు



సురేష్‌ను కలిసిన జాగర్లమూడి నాయకులు

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ఉద్దండరాయునిపాలెంలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సురేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఆయనను కలిసిన వారిలో తమ్మలూరి కోటయ్య, తమ్మలూరి జయరావు, తమ్మలూరి జాను, తదితరులు ఉన్నారు.

ప్రతిభను వెలికి తీయడానికే పోటీలు



ప్రతిభా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులతో ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: విద్యార్థినుల్లో ప్రతిభను వెలికి తీయడానికి ప్రతిభా పాటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోగల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు పోలీసులు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో మహిళ ఎదుర్కొంటున్న సమస్యలు, నివారణ చర్యలపై పోలీసుల పాత్ర అని దానిపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కారంచేడు: వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ సౌజన్యంతో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అర్హత కలిగిన మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో కే నేతాజీ ఒక ప్రకటలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 రోజుల పాటు ఉచితంగా శిక్షణనివ్వడమే కాకుండా శిక్షణ అనంతరం వారి కుటుంబ పోషణ కోసం కుట్టు మిషన్‌ను కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు మీ సమీప సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయంలలో సంప్రదించాలని ఎంపీడీఓ తెలిపారు.

బల్లికురవ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ఎంపీడీవో కుసుమ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, ఓసీ, కులాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల్లోపు మహిళలకు 90 రోజుల శిక్షణ తదుపరి ప్రభుత్వం ద్వారా కుట్టు మిషన్లు అందజేస్తామని, అర్హులు శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో వివరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్



క్షతగాత్రుడు రాజ్‌కుమార్

అద్దంకి: ఆగి ఉన్న లారీని బైకు ఢీకొట్టిన ఘటనలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని మణికేశ్వరం క్రాస్ రోడ్ వద్ద సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. వినుకొండ మండలంలోని పెదకంచర్ల గ్రామానికి చెందిన సీహెచ్ విజయ్‌రాజు బైక్‌పై పని మీద ఒంగోలు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో బైకు మణికేశ్వరం వెళ్లే క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. దాంతో బైకు నడుపుతున్న రాజ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది అక్కడకు వెళ్లి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇంటర్ పరీక్షలకు 11 మంది గైర్హాజరు

బల్లికురవ: ఇంటర్మీయేట్ రెండో సంవత్సరం సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పరీక్షల చీఫ్ పీ. రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు కాలేజీలకు సంబంధించి 107 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 96 మంది మాత్రమే హాజరయ్యారని పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు చీఫ్ వివరించారు.

మలుపులు.. మృత్యువుకు నెలవులు!

- నియోజకవర్గంలో సుమారు 124 మలుపులు
- ప్రమాదాల్లో క్షతగాత్రులుగా మిగులుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం



చందలూరు నుంచి పంగులూరు రహదారి మధ్యలో ఉన్న మలుపు

జే.పంగులూరు: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా వాహనాదారులు, ప్రయాణికులు క్షతగాత్రులుగా మిగులుతున్నారు. మరికొందరు మృతి చెందుతున్నారు. నియోజకవర్గంలోని రహదారుల్లో ఉన్న వందల సంఖ్యలోని మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఎక్కడ ఏ మలుపుందో స్థానిక ప్రజలకు తెలిసినా.. కొత్త వారికి తెలియపోవడంతో రోడ్డు ప్రమాదాలకు అవి రాచబాటలుగా మారుతున్నాయి. మలుపు ఉందనే సూచిక బోర్డు కూడా లేకపోవడం, రెండు వైపులా చిల్ల చెట్లు పెరిగి ఉండడంతో రాత్రి సమయాల్లో వాహనదారులకు మరింత ఇబ్బందికరంగా మారాయి.

124 మలుపులకుపై మాటే..

నియోజకవర్గంలోని అద్దంకి, పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని 103 గ్రామాలను తీసుకుంటే దాదాపు 124 మలుపులకు పైగానే ఉన్నాయి. పంగులూరు మండలంలోని ముప్పవరం నుంచి ఇంకొల్లుకు వెళ్లే రోడ్డు మార్గంలో 16 కిలో మీటర్లు పొడవులోనే ఆరు ప్రమాదకర మలుపులు వున్నాయి. ఈ మలుపుల్లో ఒక్క చోట కూడా అధికారులు సూచిక బోర్డులు ఏర్పడు చేయలేదు. ఈ రోడ్డు జాతీయ రహదారిని కలుపుతుండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఇక రాత్రి సమయాల్లో ఇంకొల్లు నుంచి భారీ వాహనాలు కూడా వస్తుంటాయి.

- ఆరికట్లవారిపాలెం నుంచి పంగులూరు, చందలూరు నుంచి పంగులూరు మధ్యలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల్లో గతేడాది చందలూరు గ్రామం నుంచి పంగులూరు వస్తున్న కారు మలుపు వద్ద ప్రమాదానికి గురై కారులో ప్రయాణిస్తున్న నలుగురు కుటుంబ సభ్యులు గాయాలపాలయ్యారు. పంగులూరు నుంచి ఆరికట్లవారిపాలెంలో మలుపు వద్ద కులీల ఆటో తిరగబడింది. కొంటమంజులూరు నుంచి కల్లంవారిపాలెం వైపు మలుపు వద్ద వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడి ఒక కూలీ మృతి చెందింది.



పంగులూరు నుంచి ఆరికట్లవారిపాలెం రహదారిలోని మలుపు





ముప్పవరం-ఆరికట్లవారిపాలెం మధ్యలో ప్రమాదానికి గురైన కారు, ట్రాక్టర్ (ఫైల్)

కొరిశపాడు మండలంలో..

కొరిశపాడు నుంచి కుర్రవానిపాలెం వెళ్లే ఆర్‌అడ్‌బీ రహదారిలో 12 మలుపులున్నాయి. దీంతోపాటు, దైవాలరావూరు, బొల్లవరప్పాడు మలుపు లున్నాయి. వీటికి తోడు రహదారికి రెండు వైపులా చిల్ల చెట్లు పెరగడంతో రహదార బొత్తిగా కనిపించక పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగిన దాఖలా లున్నాయి.

అద్దంకి మండలంలో..

మండలంలోని మైలవరం నుంచి ఉప్పలపాడు, అద్దంకి నుంచి నాగులపాడు నుంచి వెంకటాపురం, కంకుపాడు నుంచి మోదేపల్లి, మిట్లపల్లి నుంచి కొటికలపూడి, గోపాలపురం వద్ద అద్దంకి నుంచి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని మలుపు పలు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

సంతమాగులూరు మండలంలో..

మండలంలోని వెల్లలచెరువు నుంచి అడవిపాలెం వరకూ మూడు కిలోమీటర్ల రహదరిలో 14 మలుపులు ఉన్నాయి. మక్కెనవారిపాలెం-కొమ్మాలపాడు రహదారిలో ఒక మలుపు, కొప్పరం నుంచి సజ్జాపురం మూడు కిలో మీటరల్లో రెండు మలుపులున్నాయి. అడవిపాలెం వద్ద గతంలో ట్రాక్టరు ఢీకొని ఇద్దరు యువకులు మరణించారు. ఈ రహదారుల్లో సంబంధిత శాఖ అధికారులు స్పందించి సూచిక బోర్లును ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



మండల పరిధిలోని ప్రధాన రహదారుల్లో మలుపుల వద్ద సంబందిత అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో మలుపుల వద్ద వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. అంధికారులు వెంటనే స్పందిచి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– వెంకటరెడ్డి, తూర్పు తక్కెళ్లపాడు

మూగ జీవాల దాహం తీర్చేదెవరు?

- నిరుపయోగంగా నీటితొట్టెలు
- మూగజీవాలు అల్లాడుతున్నా పట్టించుకోని అధికారులు



గవినివారిపాలెంలో చుక్కనీరు లేని పశువులు నీరు తాగే నీటి తొట్టె

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వ నిధులతో నిర్మించిన నీటి తొట్టెలు అవసరాలను తీర్చలేకపోతుంది. వేసవి రాకముందే ఓ వైపు ఎండలు విపరీతంగా కాస్తుంటే.. గొంతు తడుపుకునేందుకు ప్రజలు, పశువులు తాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్లలో నీరులేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సాయంతో గ్రామాల్లో జన సంచారం లేని ప్రదేశాల్లో తొట్టెలను ఏర్పాటు చేయాలని ఆదేశాలివ్వడంతో పాటుగా నిధులను కూడా కేటాయించింది.

దాహం తీర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 18 నీటి తొట్టెలను గతంలో నిర్మాణం చేశారు. గత ఐదేళ్లు ఈ నీటి తొట్టెల్లో నీరు నిల్వ చేసి మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులను తీర్చింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. 5 అడుగుల వెడల్పు, 2 అడుగుల ఎత్తు, 2 మీటర్ల పొడవుతో నిర్మించిన ఒక్కో నీటితొట్టె నిర్మాణానికి రూ.18,200 ఖర్చు చేసి నిర్మాణం పూర్తి చేశారు. చీరాల మండలంలోని దేవినూతల గ్రామంలో 1, గవినివారిపాలెంలో 4, కావూరివారిపాలెంలో 4, బుర్లవారిపాలెంలో 2, కొత్తపాలెంలో 1, విజయనగర్ కాలనీలో 1, పిట్టువారిపాలెంలో 1, ఈపూరుపాలెంలో 2 నిర్మాణాలు చేశారు. ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని పశువులు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు జనసంచారం లేని పశువులు తిరిగే ప్రాంతాల్లో నీటితొట్టెల్లో నీరు నిల్వ చేయాలి.

ఒకరిమీద మరొకరు చెప్పుకుంటున్న అధికారులు..

మండలంలోని గవినివారిపాలెం, కావూరివారిపాలెం, తోటవారిపాలెం, పిట్టువారిపాలెం, దేవినూతల, సావరపాలెం, కొత్తపాలెం, కీర్తివారిపాలెం, బుర్లవారిపాలెం గ్రామాల్లో పశువులు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంచినీటి తొట్టెల్లో నీరు లేక పశువులు అల్లాడుతున్నాయి. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి తెల్లవారు జామువరకు నీటితొట్టెల్లో నీరు అందుబాటులో ఉన్నాయో.. లేదో చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో మూగజీవాలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలు మావి కావంటే మావి కావంటూ పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా నీటితొట్టెల్లో చుక్క నీరు కూడా నింపడంలేదని పశుపోషకులు విమర్శిస్తున్నారు. ఇకనైనా పశువులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు పశువుల నీటితొట్టెల్లో మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

మండల ప్రత్యేకాధికారి పీ జెన్నమ్మ ఏమంటున్నారంటే..

ఈవిషయమై మండల ప్రత్యేకాధికారి జెన్నమ్మను వివరణ కోరగా.. మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన పశువుల నీటితొట్లో నీరు ఉండటం లేదనే విషయం నాకు తెలియదు. మండల పరిషత్ అధికారులు, సిబ్బందిని విచారించి నీటితొట్టెల్లో నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. వేసవిలో పశువుల తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.



రూరల్ గ్రామాల్లో మంచినీటి కోసం అల్లాడుతున్న పశువులు

పార్టీ బలోపేతానికి అందరం కృషి చేద్దాం



మధుసూదనరెడ్డిని కలిసిన మార్టూరు నాయకులు, కార్యకర్తలు

- ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు అందరం కలిసి కృషి చేద్దామని.. పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పావులూరు గ్రామంలోని ఆయన నివాసంలో ఆయనను కలిసేందుకు వచ్చిన మార్టూరు పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. పార్టీని నియోజకవర్గంలో బలపరచేందుకు అందరం ఐకమత్యంగా ఉండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేద్దాం అని అందుకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం తాను ముందుంటానని తమకే కష్టం వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని కుటుంబ పెద్దగా ఆదుకుంటానని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాటి అనిల్, మాజీ ఎంపీటీసీ రోశిరెడ్డి, జంపని వీరయ్య చౌదరి, గన్నెపూడి రవిచంద్, తమ్మలూరి సురేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దేవరాజుని పరామర్శిస్తున్న మధుసూదనరెడ్డి, నాయకులు

మార్టూరు, ఇంకొల్లులో బండ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తిరుపతి దేవరాజును సోమవారం గాదె పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి, చిన్ని పూర్ణారావు, షంషుద్దీన్, అనిల్ చౌదరి, జంపని వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

పర్చూరు (చినగంజాం): బాల్యవివాహాలను నిర్మూలించాలని చిన్నారులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని పర్చూరు అంగన్‌వాడీ సీడీపీఓ సుభద్ర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు పర్చూరు ప్రాజెక్ట్ పరిధిలోని ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలను చేయకుండా ఉండాలని, వ్యతిరేకించాలంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పిల్లలతో మొక్కలు నాటించి బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం సంతకాలు సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పర్చూరు సెక్టార్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉప్పుటూరులో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థులు

అర్హులందరికీ ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు

స్వర్ణ (కారంచేడు): జిల్లా లేబర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లేబర్ కార్డులు (ఈ-శ్రమ్ కార్డు) మంజూరు చేస్తున్నామని సిబ్బంది తెలిపారు. మండలంలోని స్వర్ణ-1 గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి సూచనలతో గ్రామస్తులు తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. అలాగే ఇప్పటికే కార్డులు ఉన్న వారికి కూడా ఈ ఏడాది రెన్యూవల్ చేస్తున్నామన్నారు. మంగళ, బుధ వారాల్లో కూడా అందుబాటులో ఉంటామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ కార్డులను పొందేందుకు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సునీల్, లావణ్య, మానస, అరుణ, ప్రశాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



కార్డుల కోసం పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది


ఇంటిపన్నుల వసూళ్లలో వేగం పెంచాలి

చీరాల టౌన్: గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఈవోఆర్డీ శివసుబ్రమణ్యం పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా పంచాయితీ అభివృద్ధి అధికారి ఆదేశాలతో కార్యదర్శులు ఇంటిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పన్ను వసూళ్లలో అలసత్వం వలన గ్రామ పంచాయతీల్లో పలు సమస్యలు వేధిస్తున్నాయన్నారు. మార్చి 31 తేదీలోపు పన్ను వసూళ్లు వందశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల అభివృదఇకి కార్యదర్శులు శ్రద్ధగా పనిచేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ, సచివాయాల కార్యదర్శులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మార్టూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం ఉదయం స్థానిక జాతీయ రహదారిపై జరిగింది. స్టేషన్ రైటర్ సాయి వివరాల మేరకు.. ఓ గూడ్స్ ఆటో లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో మార్టూరు సివిల్ సప్లయిస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అయిన ఏ.అబ్రహాం మార్టూరు పోలీసుల సహకారంతో జాతీయ రహదారిపై నిఘా పెట్టారు. ఇసుకదర్శి సమీపంలో వస్తున్న గూడ్స్ ఆటోను అధికారులు ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం అక్రమ రవాణా విషయం వెలుగు చూసింది. ఆటోను అందులోని ఇద్దరు వ్యక్తులను స్టేషన్కి తరలించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబ్రహం ఇద్దరు నిందితులను ఆటోను పోలీసులకు అప్పగించి 80 బస్తాల రేషన్ బియ్యాన్ని భద్రత నిమిత్తం వలపర్ల గ్రామంలోని లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్‌కు తరలించారు. ఆర్ఐ అబ్రహం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థికాభివృద్ధికి యూనియన్ బ్యాంకు కృషి



కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా సంఘాల మహిళలు

చీరాల అర్బన్: డ్వాక్రా సంఘాల మహిళలకు, చిన్న తరహాల పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, చేనేతలకు ప్రభుత్వ సహకారంతో బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం రాత్రి స్థానిక ముత్యాలపేటలోని పద్మశాలీయ బహోత్తమ సంఘ కళ్యాణ మండపంలో పట్టణంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు, చిన్న తరహాల పరిశ్రమలకు పెద్ద మొత్తంలో రుణాలను మంజూరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ తాతా వేణుగోపాల్, ఒంగోలు రీజనల్ మేనేజర్ వి.రవికుమార్, యూనియన్ బ్యాంకుకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రీజనల్ మేనేజర్ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ డిజిటల్ రంగం వృద్ధి చెందాక సైబర్ నేరాలు అధికమయ్యాయన్నారు. మీ బ్యాంకు ఖాతాకు సంబంధించి బ్యాంకు సిబ్బంది ఎవరూ ఫోన్ చేయరని, ఏదైనా సమస్య వస్తే నేరుగా బ్యాంకులో సంప్రదించాలన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలకు, ఎంఎస్ఎంఈలకు రూ.40 కోట్ల నగదు చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదగా అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ, డీఐసీ జీఎం రామకృష్ణ, జిల్లా లీడ్ మేనేజర్ శివకృష్ణ, హ్యాండ్‌లూమ్ ఏడి నాగమల్లేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది హాజరయ్యారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ

బల్లికురవ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలపై సోమవారం బాపట్ల జిల్లా నుంచి వచ్చిన ముగ్గురు సభ్యులతో కూడిన కమిటి స్థానిక పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 2023–24 సంవత్సరానికి 21 గ్రామ పంచాయతీల్లో 13.5 కోట్లతో 1036 పనులు పూర్తి చేసినట్లు రికార్డుల్లో సూచించారు. సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలవారీగా తనిఖీల తదుపరి గత నెల 18న బల్లికురవలో డ్వామాపీడీ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో అక్రమాలు భారీగా జరిగిన కప్పిబుచ్చి ఏపీవో, పంచాయితీ రాజ్ ఇంజనీర్ టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రూ. 8 లక్షలు మాత్రమే రికవరీ చూపించారు. ముక్తేశ్వరం మల్లాయపాలెం, కె రాజుపాలెం, కొత్తూరు గ్రామాలో భారీగా అవినీతి జరిగిందని తనిఖీ బృందాలు ప్రజావేదిక దృష్టికి తెచ్చారు. ఈ విషయాల్లో పత్రికల్లో వరుస కథనాలు రావటంతో జిల్లా నుంచి టీమ్ వచ్చి రికార్డులు పరిశీలించి విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా కలెక్టర్ ఉన్నత స్థాయి అధికారులకు సమర్పిస్తామని టీమ్ వెల్లడించారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

పర్చూరు (చినగంజాం): మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందని డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఉప్పుటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంటువ్యాధుల గురించి వారికి అవగాహన కల్పించారు. అంటువ్యాధులు ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వివిధ వాహకాల ద్వారా సంక్రమిస్తాయని తెలిపారు. వాటిలో ముఖ్యమైనవి దోమలని అవే డెంగీ, చికున్ గున్యా, మలేరియా, ఫైలేరియాసిస్, జపనీస్ యాన్సెఫలిటీస్ వంటి వ్యాధులు సంక్రమించడానికి ప్రకమ కారణమన్నారు. ప్రథమ దశలో ఉన్న దోమల వ్యాప్తిని అరికట్టడానికి నీటి కుంటలో కొబ్బరి చిప్పలో పాత బండి టైర్లలో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలను నియంత్రించే అజోల్లా గడ్డిని గంబూసియా చేపలను పెంచాలని పిలుపునిచ్చారు. ఇది విఫలమైతే రెండవ దశలో దోమ తెరలను, దోమలను చంపే రసాయనిక పొగలను వాడాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కే వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రిప్ పైపుల దగ్ధం



దగ్ధమైన పైపులను చూపుతున్న రైతు పాపారావు

యద్దనపూడి: చెరువుకట్టపై ఉంచిన డ్రిప్ పైపులను గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేసిన ఘటన మండలంలోని సూరవరపుపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బాధిత తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుంజి పాపారావు తన వ్యవసాయ అవసరాల నిమిత్తం ఉపయోగించే నీటి పైపులను గ్రామంలోని చెరువుకట్ట పక్కన ఉంచాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి పైపులకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. స్థానిక మహిళకు రబ్బరు కాలిన వాసన రావటంతో బయటకు వచ్చి చూడగా పైపులు తగలబడుతూ ఉండటంతో వెంటనే చుట్టుపక్కల వారిని నిద్రలేపారు. వెంటనే స్థానికులు చెరువులోని నీటిని తోడి మంటలు ఆపివేశారు. ఈ పైపుల విలువ సూమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు పాపారావు వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపాడు.